సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 21 । జూన్ । 2024



జీవన 'యోగ'ం 8లో▸

భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. యోగా భారతదేశంలో పుట్టి ప్రస్తుతం ప్రపంచదేశాలకూ విస్తరించింది. నేడు యోగా దినోత్సవం నేపథ్యంలో కథనం.



క్షణక్షణం..భయంభయం

తలమడుగు మండలంలో చిరుత సంచారంతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ముఖ్యంగా అటవీ సమీప గ్రామాల జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: బాధిత పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మార్చి 8న కుంటాల జలపాతం వద్ద విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన కానిస్టేబుల్ మార్కండేయ కుటుంబానికి రూ.8లక్షల భద్రత చెక్కును గురువారం పోలీసు ముఖ్య కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఫిర్యాదుల విభాగం అధికారి కవిత జైస్వాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి ఉత్తర్వులు

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతి ప్రక్రియలో భాగంగా ఇటీవల సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు అందని ఉపాధ్యాయులకు గురువారం ఆర్డర్స్ కాపీ అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రం సబ్జెక్టులో 43 మందికి, బయోసైన్స్‌లో 27 మందికి ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. కాగా పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులకు ఇంకా పదోన్నతి ఉత్తర్వులు అందలేదు. దీంతో వారు మూడు రోజులుగా నిరీక్షిస్తున్నారు.

'పరిష్కారానికి నోచుకోని గ్రీవెన్స్ దరఖాస్తులు'

ఆదిలాబాద్‌రూరల్:కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో అందించే దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదని కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా కొనసాగుతున్న ప్రజావాణిలో కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇందులో ఆదివాసీ సంఘాల నాయకులు తుమ్మురామ్ చందరషావ్, రాజు, శేఖర్, సాంబయ్య, వెంకట్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

నార్నూర్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులతోపాటు సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలపై ఆరా తీశారు. ప్రతీ కాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యేలా చూడాలన్నారు. అలాగే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆయన వెంట డీఎంవో శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ రాంబాబు, హెచ్‌ఈ నాందేవ్, సిబ్బంది తదితరులున్నారు.

ఆధార్ వివరాలు నమోదు చేయాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు(డీడీవోలు) తమ పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సంబంధించిన ఆధార్ సంఖ్యను ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ట్రెజరీశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ హారిక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే నమోదు చేసి ఉంటే ఆధార్ నిజప్రతితో సరి చూడాలని పేర్కొన్నారు. జూన్ వేతన బిల్లుకు ఆధార సంఖ్య నమోదుకు సంబంధించిన సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. ఈ నెల 25లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని డీడీవోలను ఆదేశించారు.

ఇది ఆదిలాబాద్‌లోని జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో గల మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ సబ్‌రిజిస్ట్రార్ చాంబర్. ఖాళీగా కనిపిస్తున్న కుర్చీ ఆ అధికారిదే. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ సవరణపై అన్నిచోట్ల అధికారులు బిజీగా ఉంటే.. ఇక్కడ మాత్రం ఈ టేబుల్ ఇలా ఖాళీగా దర్శనమిస్తోంది. ఇది నిత్యకృత్యమేనని, అయితే ప్రస్తుతం సవరణలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు విధివిధానాలపై స్పష్టతనివ్వాల్సిన బాధ్యతల్లో ఉన్న ఈ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేమని అడిగే ధైర్యం ఉన్నతాధికారి కూడా చేయలేని పరిస్థితి అని ఆ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదేమంటే.. గతంలో ఈ సబ్‌రిజిస్ట్రార్ హైదరాబాద్‌లోని ఉన్నతాధికారి వద్ద పనిచేశాడనే రుబాబు. అక్కడ ఉన్న పరిచయాలు వల్లె వేస్తూ డ్యూటీ సరిగా చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అంతా నా ఇష్టం!

- జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో ఓ సబ్ రిజిస్ట్రార్ తీరు
- ఇంట్రెస్ట్ ఉంటేనే కార్యాలయానికి.. లేకపోతే నో!
- గతంలో హైదరాబాద్‌లో పనిచేశాననే రుబాబు
- మార్కెట్ విలువ సవరణ నేపథ్యంలోనూ మారని తీరు
- కీలక అధికారి విధి నిర్వహణపై సర్వత్రా విమర్శలు

సాక్షి,ఆదిలాబాద్: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా భూ విలువలకు సంబంధించి మార్కెట్ విలువ సవరణ ప్రక్రియ కొనసాగుతుంది. వచ్చే ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువలను అమలుపర్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. అంతలోపు విధివిధానాలు రూపొందించి క్షేత్రస్థాయిలో సవరణ పరంగా పరిశీలించాల్సిన అంశాలపై సూచనలు, సలహాలు జారీ చేస్తుంది. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వీటన్నింటికీ సంబంధించి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం (డీఆర్) ఆదిలాబాద్‌లోనే ఉంది. ఈ కార్యాలయంలోనే మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ సబ్‌రిజిస్ట్రార్ పోస్టులు రెండు ఉన్నాయి. ఇందులో ఒకటి ఖాళీగా ఉండగా, మరొక పోస్టులో ఓ అధికారి బాధ్యతల్లో ఉన్నారు. కాగా ఈ సవరణలకు సంబంధించి ఎస్‌ఆర్‌వో పరిధిలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, సబ్‌రిజిస్ట్రార్ కన్వీనర్‌గా, ఆర్డీవో మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఎస్‌ఆర్‌లు, ఇతర సిబ్బందికి మార్కెట్ విలువ సవరణలో అనుసరించాల్సిన విధివిధానాలపై డీఆర్ కార్యాలయంలోని మార్కెట్ వాల్యూ సబ్‌రిజిస్ట్రార్ స్పష్టతనివ్వాలి. ప్రస్తుతం బిజీగా ఉండాల్సిన ఈ సమయంలోనూ ఆ అధికారి ముందు నుంచి వ్యవహరిస్తున్నట్టే డ్యూటీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆదిలాబాద్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

గైడెన్స్ ఇవ్వాలి..



మార్కెట్ వాల్యూ సబ్ రిజిస్ట్రార్ సవరణలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విధి విధానాలపై గైడెన్స్ ఇవ్వాలి. ఆ సబ్ రిజిస్ట్రార్ ఆసిఫాబాద్ ఎస్‌ఆర్‌గా కూడా డిప్యూటేషన్‌పై ఉన్నారు. అయితే మార్కెట్ విలువ సవరణలో క్షేత్రస్థాయిలో ఆ ఎస్‌ఆర్‌వో పరిధిలోని అధికారులే కీలకంగా వ్యవహరిస్తారు. డ్యూటీ సరిగ్గా చేయడం లేదనే విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలన చేస్తాను.

– ఫణీందర్, జిల్లా రిజిస్ట్రార్, ఆదిలాబాద్

అక్కడ.. ఇక్కడ అంటూ డ్యూటీ ఎగవేత..

డీఆర్ కార్యాలయంలో మార్కెట్ వాల్యూ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆ అధికారికి ఆసిఫాబాద్‌లోనూ సబ్‌రిజిస్ట్రార్ ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టారు. దీన్ని ఆ అధికారి దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఆ శాఖలోనే వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ వాల్యూతో పాటు ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ కూడా కావడంతో ఆ అధికారి ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆడిట్ చేసే అధికారం ఉంది. ఆదిలాబాద్‌లో సరిగ్గా విధులు నిర్వర్తించక పోగా, అటు ఆసిఫాబాద్‌లోనూ ఓడీ పేరిట తాను అక్కడికి వెళ్తున్నా.. ఇక్కడికి వెళ్తున్నానని చెబుతూ డ్యూటీ ఎగ్గొడుతున్నాడనే ప్రచారం ఉంది.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా
- నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిల్లలకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణ కోసం ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్దేశిత వయసులోపు వారికి వీటిని వేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 2,21,141 మంది ఈ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. ఆహారం తీసుకున్న తరువాతే మాత్ర వేసుకోవాలన్నారు. ఈ నెల 27 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, డీఈవో ప్రణీత, సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్, వైద్యాధికారులు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



బాలికకు నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఉట్నూర్‌కు సబ్‌కలెక్టర్ హోదా

- ఉమ్మడి జిల్లాలో మరో మూడు..
- భైంసా, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ కూడా..
- ఆర్డీవో స్థానంలో ఇక ఐఏఎస్ అధికారి



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

భైంసాటౌన్/కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లికి సబ్ కలెక్టర్‌స్థాయి హోదా దక్కాయి. ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ కేడర్ అధికారిని నియమించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్, భైంసా, కాగజ్‌నగర్, బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్లకు గాను ఇప్పటి వరకు ఆర్డీవో స్థాయి అధికారి ఉండగా, ఇకపై ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండనున్నారు. పరిపాలన ఆవశ్యకతలో భాగంగా రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లలో ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించడానికి ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం ద్వారా జీవో 834ను తేదీ 13.06.2024న జారీ చేసింది.

చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: శిశు గృహలో చిన్నారులను సొంత పిల్లలుగా చూసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని శిశుగృహను గురువారం ఆయన సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే పోషక ఆహారంపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం తొమ్మిది మంది పిల్లలు ఉన్నారని, ఆరుగురు ఆయాలు అవసరం ఉండగా, ప్రస్తుతం ఐదుగురు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక ఆయాతో పాటు ఏఎస్‌ఎంను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలకు దత్తత ఇవ్వడంలో భాగంగా ఆసక్తి గల వారు తార పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఉట్నూర్ ఏసీడీపీవో మిల్కా, శిశుగృహ మేనేజర్ విజయలక్ష్మి, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, ఎన్‌జీసీ స్వామి, స్వప్న తదితరులు ఉన్నారు.

డి అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో డవ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యపాన, మాదక ద్రవ్య వ్యసన విముక్తి చికిత్స, పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా గురువారం తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లతో పాటు రెఫరల్ చేసిన పేషంట్ వివరాలు, రిమ్స్ ఆసుపత్రికి ఎంతమందిని పంపించారు, మెడిసిన్ ఎంతమందికి ఇచ్చారనే వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. యోగా టీచర్ రోజూ వస్తున్నారా, విధులు సరిగా నిర్వహిస్తున్నారా అనే దానిపై సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానాలు చెప్పకపోవడం, రిజిస్టర్‌లో వివరాలు సరిగా లేకపోవడం, బెడ్స్, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కేంద్రం నిర్వహణ లోపాలను సరిచేసుకుని రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సబిత, సీడీపీవో మిల్కా, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, స్వామి, రమేశ్, సోషల్ వర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

'అవిశ్వాసం'పై నివేదిక అందించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 34 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస నోటీసును పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ రాజర్షి షాకు బుధవారం అందజేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ అవిశ్వాస ప్రక్రియకు సంబంధించిన సమగ్ర నివేదిక అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్‌ను ఆదేశించారు. మ్యాజిక్ ఫిగర్ ఎంత ఉండాలి.. తీర్మానంపై చేసిన సంతకాలు సంబంధిత కౌన్సిలర్లవేనా..ఏమైనా ఫోర్జరీ చేశారా అనేదానిపై పోల్చి చూడాలని సూచించారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందజేయాలని ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నివేదిక అధారంగా కలెక్టర్ తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అయితే మున్సిపల్ కమిషనర్ గురువారం అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ఈ వివరాలు పరిశీలించే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఎలాగైనా వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గాలని నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు పట్టుదలతో యత్నిస్తుండగా, అదే స్థాయిలో దాన్ని వీగిపోయేలా చేసేందుకు అవసరమైన ప్రణాళికను వైస్ చైర్మన్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆదిలాబాద్ బల్దియా రాజకీయం రసవత్తరంగా మారనుంది.

'నీట్' అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

కైలాస్‌నగర్: ఈ ఏడాది మే 5న ఎన్‌టీఏ నిర్వహించిన నీట్‌లో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించిన నాయకులు ఎన్‌టీఏ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.మల్లేశ్ మాట్లాడుతూ.. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ చెలగాటమాడిందన్నారు. బీహార్‌లో పేపర్ లీక్ అయిన ఘటనలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.30లక్షల చొప్పున వసూలు చేసినట్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో వెంటనే నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ రాష్ట్రాల వారీగా పాతపద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాఘవులు, నాయకులు బండి దత్తాత్రి, మంజుల, స్వామి, అరవింద్, పొచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఏ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ధర్నా

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తక్షణమే విడనాడాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు అన్యాయం చేసేలా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రాగానే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించడం విచారకరమన్నారు. ఏళ్లుగా చేసిన పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

చర్చ సాగేనా..?

- నేడు జెడ్పీ చివరి సర్వసభ్య సమావేశం
- అరకొర నిధులతోనే ముగియనున్న పదవీకాలం
- విమర్శలు.. ప్రతి విమర్శలతో నెట్టుకొచ్చిన వైనం

కైలాస్‌నగర్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ ప్రధాన వేదికగా నిలుస్తోంది. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనలోనూ కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన జెడ్పీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక చేయూత నామమాత్రంగా మారింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి అందకపోగా, కేంద్రం నుంచి సైతం అరకొర నిధులే రావడంతో జిల్లా అభివృద్ధిపై పాలకవర్గం ముద్ర కనిపించకుండా పోయింది. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భరోసా కల్పించాల్సిన అధికార, విపక్ష సభ్యులు పరస్పర విమర్శలతోనే సరిపెట్టారనే విమర్శలున్నాయి. జెడ్పీసభ్యుల పదవీకాలం వచ్చే నెల 5వ తేదీతో ముగియనుంది. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశం ఈ పాలకవర్గానికి చివరిది కానుంది. ఈ సమావేశంలోనైనా ప్రజా సమస్యలపై చర్చించి భరోసా కల్పిస్తారా.. లేక సభ్యుల సన్మానాలతోనే ముగిస్తారా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

మొక్కుబడి సమావేశాలు

ప్రతీ మూడు నెలలకోసారి జెడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఇందులో జిల్లాలోని 42 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రగతిపై చర్చించేందుకు సమావేశ అజెండాలో పొందుపర్చేవారు. గడిచిన ఐదేళ్లలో పూర్తి అజెండాపై చర్చ జరిగిన సందర్భాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. కీలకమైన 10, 12 శాఖలపైనే ప్రధానంగా చర్చ సాగేది. లంచ్ వరకు ఆయా శాఖలపై వాడీవేడి చర్చ సాగిన సందర్భాలు ఉండగా.. భోజన విరామం అనంతరం ప్రజాప్రతినిధులతో పాటు సభ్యులు సైతం గైర్హాజరయ్యేవారు. ఐదేళ్లలో ఒక్క సమావేశంలో కూడా చర్చకు రాని అనేక ప్రభుత్వ శాఖలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చర్చ సందర్భంగా శాఖకు సంబంధించిన అంశాల కంటే సభ్యులు పరస్పర విమర్శలకే పరిమితమయ్యారనే అపవాదు ఉంది.



జిల్లా పరిషత్ కార్యాలయం

అరకొర నిధులే ..

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్య నిర్వహణతో పాటు పంచాయతీలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులను పర్యవేక్షించి వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చూడాల్సిన బాధ్యత జెడ్పీపై ఉంది. అయితే గడిచిన ఐదేళ్ల వ్యవధిలో ఆదిలాబాద్ జెడ్పీకి అరకొరగానే నిధులొచ్చాయి. 2019–20 నుంచి 2023–24 వరకు రూ.15కోట్ల 84 లక్షల16వేల 878 మాత్రమే అందాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపులు పూర్తిగా నిలిచిపోగా, కేవలం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు మాత్రమే విడుదలవుతున్నాయి. ఈ నిధులను జిల్లాలోని 17 మండలాలకు కేటాయింపులు చేయాల్సి ఉండటంతో ఒక్కో మండలానికి రూ.కోటి కూడా రాని పరిస్థితి. ఈ నిధులు చిన్నపాటి పనులకే పరిమితమయ్యాయి తప్ప జెడ్పీ ద్వారా చెప్పుకోదగిన అభివృద్ధి అంటూ ఏదీ జరగలేదు. వచ్చిన ఈ కొద్ది పాటి నిధులు సైతం ఖర్చు చేయడంలో జెడ్పీ యంత్రాంగం విఫలమైంది. రూ.15కోట్లకు పైబడి నిధులు రాగా.. ఇప్పటి వరకు రూ.14కోట్ల 1లక్ష 48వేల 605 మాత్రమే ఖర్చు చేశారు. అభివృద్ధి పనులు నామమాత్రంగానే ఉండటం చైర్మన్‌తో పాటు సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది. నిధుల్లేకపోవడంతో జెడ్పీ సభ్యులు మండలాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారారనే అప్రతిష్టను మూటగట్టుకున్నారు.

చైర్మన్ సహా సభ్యులకు సన్మానాలు

జెడ్పీ పాలకవర్గం గడువు జూలై 5తో ముగియనుంది. ఈ క్రమంలో చైర్మన్ జనార్దన్ రాథోడ్‌తో సహా సభ్యులను సన్మానించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ రాజర్షి షా, జెడ్పీ సీఈఓ రత్నమాల తొలిసారిగా జెడ్పీ సమావేశాలకు హాజరు కానుండటంతో వారిని కూడా సన్మానించనున్నారు.

చర్చిస్తారా.. లేక

మండల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన జెడ్పీటీసీలు తమను గెలిపించిన ప్రజలకు ఏదో చేయాలని సంకల్పించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక చేయూత లేకపోవడంతో కేవలం ప్రజాప్రతినిధి అన్న మాటకే పరిమితమయ్యారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారు. శుక్రవారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశం ఈ పాలకవర్గానికి చివరిది. కాగా జిల్లాలో ప్రధాన సమస్యలు అనేకం వేధిస్తున్నాయి. మన ఊరు మనబడి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగు పనులు మొదలైనా రైతులకు ఖరీఫ్ రుణాలు అందించే వార్షిక ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ లాటరీకే పరిమితమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు సంబంధించిన రాయితీ జిల్లాలో వేలాది మంది లబ్ధిదారులకు అందని పరిస్థితి. ఈ సమావేశంలోనైనా ఈ సమస్యలపై చర్చించి ప్రజలకు భరోసా కల్పిస్తారా.. లేక సన్మానాలతోనే సరిపెడుతారా అనేది నేడు తేలనుంది.

క్లుప్తంగా

సీఎం దృష్టికి ట్రిపుల్ఐటీ సమస్యలు



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

బాసర: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీచర్ ఎమ్మెల్సీ కూర రఘూత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాసర ఆర్జీయూకేటీ(ట్రిపుల్ఐటీ) కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీశైలం గురువారం కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, పీఆర్సీని యూజీసీ 7వ వేతన ఒప్పందం ప్రకారం చెల్లించాలని కోరారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కూడా కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై వినతిపత్రం అందించారు. పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి కూడా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న ఎంపీ అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిశీలన

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ పరిశీలన సమావేశం ఈ నెల 29న కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పార్లమెంట్ ఎన్నికల నోడల్ అధికారి, డీసీవో బి.మోహన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రశీదులు, ఓచర్లను సమర్పించి ఖర్చు వివరాలు పరిశీలించుకోవాలన్నారు. రశీదులతో పాటు ఓ అఫిడవిట్ నోటరీ చేయించుకుని రావాలని సూచించారు.

బాసరలో పండ్ల విక్రయానికి వేలం

బాసర:శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానంలో 2024-25 సంవత్సరంలో పండ్ల విక్రయ హక్కుల కోసం సీల్డ్, బహిరంగ వేలం గురువారం నిర్వహించారు. టి.రాజేశ్‌గౌడ్ రూ.12 లక్షలకు హక్కులను దక్కించుకున్నట్లు ఈవో విజయ రామారావు తెలిపారు. గతేడాది ఇదే వ్యాపారి పండ్ల వ్యాపార హక్కులను రూ. 6.80 లక్షలకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈసారి రూ.5.20 లక్షలు అదనంగా చెల్లించి హక్కులు దక్కించుకున్నట్లు ఈవో పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం



స్తంభాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని విద్యుత్ స్తంభాన్ని గురువారం ఓ వాహనం ఢీకొట్టింది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆస్పత్రి ఆవరణలో ఉన్న మెడిసిన్ స్టోర్ ప్రాంతంలోకి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పెద్ద వాహనంలో ఔషధాలు తీసుకొచ్చారు. ఈ క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం వంగిపోవడంతో విద్యుత్ తీగలుకిందకు వచ్చాయి. ఈఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈఘటన కారణంగా రోజంతా ఆస్పత్రిలో అంధకారం అలుముకుంది. డయాలసిస్ సెంటర్‌కు విద్యుత్ సరఫరా చేసే బాక్సు పేలి తీవ్రనష్టం జరిగింది. ఈ విషయమై సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను వివరణ కోరగా, వాహనం ఢీకొనడంతో జరిగిన నష్టాన్ని వాహనదారులే భరించి మరమ్మతు చేయిస్తున్నారని తెలిపారు. రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

జీవన 'యోగ'ం



యోగా ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు తిరుపతిరెడ్డి

- నిత్య సాధనతో ఆరోగ్యం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్/నిర్మల్‌ఖిల్లా: భారతీయ సనాతన సంస్కృతికి ఎంతో విశిష్టత ఉంది. యోగ భారతదేశంలో పుట్టి నేడు ప్రపంచదేశాల్లో కూడా వేగంగా విస్తరించింది. ప్రతి ఒక్కరూ వ్యాయామంలో యోగనే ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అదీమన భారతదేశ గొప్పతనం. దీన్ని ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 నుంచి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజున దినంలో సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఒక కారణంగా చెప్తారు. మనసును నిగ్రహపరచడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆసనాలు..

వివిధ రకాల ఆసనాల ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రాణాయామం, వృక్షాసనం, వీరభద్రాసనం, పశ్చిమోత్తాసనము, గోముఖాసనము, శీర్షాసనం, పూర్ణ శలభాసనం, చక్రాసనం ఆసనాల ద్వారా రక్తశుద్ధి, నరాలకు బలం చేకూర్చడం, పొట్ట తగ్గడం, బరువు తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని శిక్షకులు సూచిస్తున్నారు.



యోగా నేర్పిస్తున్న సంధ్య బెదోడ్కర్



యోగా శిక్షణ ఇస్తున్న శిక్షకుడు సంతోష్

ఐదేళ్లప్రాయం నుంచే...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌కు చెందిన ద్యావరశెట్టి చైతన్య తన తండ్రి ప్రభాకర్ చేస్తున్న యోగాసనాలను చూస్తూ పెరిగింది. ప్రభాకర్ నిజామాబాద్‌లో యోగాచార్యులుగా గుర్తింపు పొందారు. ఐదేళ్లకే చైతన్య ఆసనాలు వేయడం ఆరంభించింది. యోగ విద్యలో పట్టు సాధించడమే కాకుండా పట్టా కూడా పొందేందుకు 2008లో నాసిక్‌లోని యశ్వంత్‌రావు చౌహాన్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ యోగా పూర్తిచేసింది. భర్త ద్యావరశెట్టి వేణుగోపాల్ సహకారంతో ప్రస్తుతం యోగాసాధన కొనసాగిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ పతకాలనూ సాధించింది. మాజీ ఎంపీ మధుయాష్కీ చేతుల మీదుగా ఉత్తమ యోగా ప్రదర్శకురాలిగా అవార్డునూ పొందారు.

ఉచితం.. సమాజ'హితం'...



నిర్మల్‌ఖిల్లా: 2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను.. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగా అలవాటు చేసుకున్నాను. ఆసనాలు, ప్రాణాయామ, సూర్య నమస్కారాలు ప్రతీరోజు రెండు గంటలు చేస్తున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటి నుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నేను చేయడమే కాకుండా నా వద్దకు వచ్చే మరో వంద మందికి ఉచితంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోని వశిష్ఠ యోగా సంఘటన్‌లో ఉదయం శిక్షణ ఇస్తున్నాను. – జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, నిర్మల్

దినచర్యలో ఒక భాగం చేసుకోవాలి



మన దినచర్యలో యోగాను ఒక భాగం చేసుకోవాలి. ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. ఏ వ్యాధికి సంబంధించిందైనా పూర్తిగా అదుపులో ఉంచేందుకు, ఆ వ్యాధులను తగ్గించేందుకు యోగ ఉపయోగపడుతుంది. ధ్యానం, ప్రాణామాయం వంటివి ఒత్తిడిని దూరం చేయడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు సునాయాసంగా చేసేందుకు యోగా ఉపయోగపడడంతోపాటు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. యోగ ఆసనాలను ఇష్టం వచ్చినట్లు వేయకుండా శిక్షకులు చెప్పిన పద్ధతిలో వేయాలి. – గోనె మణిమాల, యోగ శిక్షకురాలు, మంచిర్యాల

విస్తృత ప్రయోజనాలు



యోగా సాధన మనిషి జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తుంది. ఇది కేవలం శారీరక వ్యాయామానికి మాత్రమే పరిమితం కాదు. విస్తృత ప్రయోజనాలు ఉంటాయి. నిరంతర సాధనతో ప్రశాంతత చేకూరుతుంది. తనలోని అంతరంగాన్ని చదివే దిశగా మనిషిని ప్రేరేపిస్తుంది. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు చేయవచ్చు. ముఖ్యంగా నేటి యువత యోగా సాధన అలవర్చుకోవాలి. – సంధ్య బెదోడ్కర్

పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా..



నిత్యజీవితంలో పెరిగిన ఒత్తిడితో పాటు ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో శారీరక, మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయి. రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధులు అదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో వ్యాధుల నియంత్రణకు, మానసిక దృఢత్వం సాధించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధనతో ప్రతి ఒక్కరిలో ఉత్తేజం నింపుతుంది. శరీరం, మనస్సుపై అదుపు ఏర్పడుతుంది. భారతీయ సంస్కృతి ప్రసాదమైన యోగా పలువురికి నేర్పిస్తుండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. – తిరుపతి రెడ్డి, యోగా శిక్షకుడు, పతంజలి యోగ భవన్

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



యోగాకు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది. దీనిని ఒక క్రీడగా గుర్తించడంతో ఈ కోర్సులకు డిమాండ్ పెరుగుతుంది. భవిష్యత్తులో ఒలంపిక్ క్రీడల్లో సైతం దీన్ని చేర్చే అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్యంతో పాటు ఉపాధి సైతం యోగా ద్వారా సాధ్యమవుతుంది. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాల్లో యోగాను చేర్చడం శుభ పరిణామం. అలాగే పాఠశాలల్లో ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుండడం దీనికి పెరుగుతున్న మద్దతుకు సంకేతంగా నిలుస్తుంది. యోగాతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. – సంతోష్, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్

ఏకాగ్రత పెరుగుతుంది..



చెన్నూర్: వేసవి సెలవుల్లో యోగా నేర్చుకున్నా. యోగా క్లాస్‌ల ద్వారా ఏకగ్రత పెరుగుతుంది. గత ఏడాది నుంచి యోగా శిక్షణ పొందుతున్నా. జ్ఞాపక శక్తి పెరిగింది. ఎండకాలంలో సెలవులను యోగా శిక్షణ తరగతులతో గడిపాను. –బి.రుత్విక్, విద్యార్థి

ఆసనాలు నేర్చుకున్నా..



చెన్నూర్: మొదట యోగా ఆసనాలు వేయాలంటే కష్టంగా ఉండే. ప్రతీరోజు క్లాస్‌లకు వచ్చాను. ప్రస్తుతం నాకు అన్ని రకాల యోగా ఆసనాలు వేయడం వచ్చు. ఎలాంటి ఫీజు తీసుకోకుండా గత నాలుగేళ్ల నుంచి యోగా శిక్షణ ఇస్తున్నారు. –గంగుల జస్విత, విద్యార్థిని, చెన్నూర్

పది మందికి నేర్పించాలని..



చెన్నూర్: నేను నేర్చుకున్న యోగా వృథా కావద్దనే ఉద్దేశంతో పది మందికి నేర్పిస్తున్నా. నాలుగేళ్ల నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. ప్రస్తుతం ఉదయం ఒక బ్యాచ్, సాయంత్రం ఒక బ్యాచ్ చొప్పున వస్తున్నారు. ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. –మంచాల పద్మజ, యోగా శిక్షకురాలు, చెన్నూర్

దుబాయ్‌లో నిర్మల్ జిల్లా వాసి మిస్సింగ్

- ఉపాధి నిమిత్తం వెళ్లిన రెండు రోజులకే..
- అచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



కస్తూరి చందు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ దేశమైన దుబాయ్‌కి ఉపాధి నిమిత్తం వెళ్లిన నిర్మల్ జిల్లావాసి అక్కడ అదృశ్యమైనట్లు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన కస్తూరి శేఖర్ కుమారుడు కస్తూరి చందు(19) ఈ నెల 14న ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడికి చేరుకున్న చందు టాక్సీలో ఏజెన్సీ వారు కేటాయించిన గదిలో ఉంచగా మరుసటిరోజే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా అతని సెల్‌ఫోన్ ఆధారంగా ఆచూకీ కనుక్కొని మళ్లీ అతనిని తీసుకువచ్చారు. ఇదే నెల 16వ తేదీన అర్ధరాత్రి అందరూ పడుకున్న తర్వాత తన గది నుంచి మళ్లీ వెళ్లిపోయాడు. ఆచూకీ తెలియకపోవడంతో మిస్సింగ్ కేసును నమోదు చేయించారు. ఈ విషయం స్వగ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియగా వారు ప్రవాసీ మిత్ర లేబర్ లేబర్ యూనియన్ వాలంటీర్ ఏనుగు సాయి రాజుకు సమాచారం అందించారు. అనంతరం లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పండ్లను కలిసి పూర్తి వివరాలు తెలిపారు. దుబాయ్ ఎంబసీకి పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని పంపించారు. ఉపాధి నిమిత్తం విజిట్ వీసాపై వెళ్లిన యువకుడు అదృశ్యమైనట్లు అక్కడి సామాజిక మాధ్యమాల్లో, స్థానిక గల్ఫ్ కార్మికుల సంఘాల నాయకులకు సమాచారం అందించి ఆచూకీ కనుగొనే పనిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

నిర్మల్‌లో వీధి కుక్కల బీభత్సం



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. రెండు సంవత్సరాల బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాజులపేట్ ప్రాంతంలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ షేక్ అజ్గర్ కుమారుడు షేక్ రోహన్ అనే బాలుడు బుధవారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కల గుంపు ఒక్కసారిగా దాడిచేశాయి. బాలుడు కేకలు విన్న చుట్టుపక్కల వారు కుక్కలను తరిమేందుకు ప్రయత్నం చేయగా, కుక్కలు వారిపై తిరగబడ్డాయి. దీంతో రాళ్లు, కర్రలతో కుక్కలను తరిమేశారు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు..

జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో బుధవారం రాత్రి జరిగిన ఘటనపై కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజుకు గురువారం ఫిర్యాదు చేశారు. కుక్కల బెడద నివారించాలని కోరారు. కుక్కల భయంతో బయటకు వెళ్లడానికి కూడా భయపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో ఎంఐఎం నాయకులు మహమ్మద్ ఇర్ఫాన్, ఆమన్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడు.. శవమై లభ్యం

- గోపాయిచెరువులో తేలిన మృతదేహం
- ఉట్నూర్ మండలంలో ఘటన



సాయికుమార్ (ఫైల్)



గోపాయిచెరువులో తేలిన సాయికుమార్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: నెల 18న అదృశ్యమైన బాలుడు మండల కేంద్రంలోని గోపాయి చెరువులో అనుమానాస్పదంగా శవమై తేలిన ఘటన మండలంలో కలకలం రేపింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత ఉట్నూర్ ఎన్ఆర్‌నగర్ కాలనీకి చెందిన రాథోడ్ గోపాల్–కల్పన దంపతులకు నలుగురు సంతానం. వీరి రెండో కుమారుడైన రాథోడ్ సాయికుమార్ (9) ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోపాయిచెరువులో తేలిన మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి సాయికుమార్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రయోగాత్మకంగా బోధన సాగాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: ప్రయోగాత్మక బోధనతోనే విద్యార్థులు సులువుగా అర్థం చేసుకొని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమంలోనే బోధన చేయాల్సి ఉన్నందున విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతులను ఎంచుకోవాలన్నారు. ప్రతి నెల ఒక రోజు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలు, వంటగది, స్టోర్ రూం, తదితర వాటిని పరిశీలించారు. హాజరుపట్టికలను పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇందులో శిక్షణ తరగతుల ప్రత్యేకాధికారి పార్థసారథి, ప్రధానోపాధ్యాయులు నారాయణ, కృష్ణవేణి, తదితరులున్నారు.

పాటకు ప్రాణం పల్లవి అయితే..

- సంగీతమే సమస్తంగా భావిస్తూ..
- స్వరం, గానంతో అలరిస్తున్న కళాకారులు
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం



పురస్కారం స్వీకరిస్తున్న నాగరాజు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: సంగీతం ఈ మూడక్షరాల పదానికి ఉన్న శక్తి మాటల్లో వర్ణించలేనిది. రాగం.. తానం.. పల్లవి ఈ మూడు సంగీత సరస్వతికి ప్రాణాధారాలు, సరిగమపదనిసలే సప్తస్వరాలై సంగీత ప్రపంచానికి మూలాధారాలుగా నిలుస్తున్నాయి. కాలాన్ని సైతం మరపించి.. మానసిక ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని ప్రసాదించే శక్తి సంగీతానికి మాత్రమే సొంతమని అనడంలో అతిశయోక్తి లేదు. మనిషిని కదిలించి.. కరిగించే మహత్తర శక్తి సంగీతానిది. జూన్ 21న అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

1982 నుంచి ప్రత్యేక దినోత్సవం..

మొట్టమొదట మ్యూజిక్ డే ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. దీనిని 1982వ జూన్ 21 నుంచి కొనసాగిస్తూ వస్తున్నారు. ఆ రోజును 'మ్యూజిక్ డే లేదా అంతర్జాతీయ సంగీత దినోత్సవం' గా ప్రపంచ దేశాలు జరుపుకుంటున్నాయి.

ప్రాణం పోస్తున్నారు...

జానపద సంగీతం, స్వరకల్పన ద్వారా పాటల్ని, సంగీతాన్ని వెలికి తీయడానికి శ్రమిస్తున్నారు జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన జానపద గాయకుడు, కళాకారుడు చెనిగారపు నాగరాజు తన మిత్రుడైన నర్సాపూర్–జి మండల కేంద్రానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ పోలీస్ కానిస్టేబుల్ కొత్త కొండ రంజిత్‌కుమార్‌తో కలిసి 'పాటే మా ప్రాణం' అనే సంగీత స్వరకల్పన వేదికను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సంగీతంపై మక్కువ ఉన్న వారిని ప్రోత్సహిస్తూ, వారిలోని నైపుణ్యాలను వెలికి తీయాలన్నా ప్రధాన లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 100 మంది కళాకారులను వారిలోని సంగీత గాత్ర నైపుణ్యాలను వెలికి తీసి బాహ్య ప్రపంచానికి పరిచయం చేశారు.

స్వీయసంగీత సాధనతో ఉపాధి..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన 'రాజుల నాగరాజు'. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన నాగరాజు సరదాగా బాల్యంలో పాటలు పాడేవాడు. ఉపాధి కోసం ఎన్నో దారులు వెతికాడు. తనకున్న అభిరుచి పాటలు పాడడంలో సాధన చేశాడు. యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో సంగీతానికి సంబంధించిన ప్రాథమిక మెలకువలు ఇంటివద్దే నేర్చుకున్నాడు. ఈవెంట్లలో ప్రధాన గాయకుడిగా పాడడం ద్వారా శక్తిమేర డబ్బులు సంపాదించడం మొదలుపెట్టాడు. క్రమంగా పాటల పాడే అవకాశాలు, లైవ్‌షోలు పెరగడంతో తానే సొంతంగా ఈవెంట్స్ నిర్వాహకుడిగా ఎదిగాడు. ఆధ్యాత్మిక పాటలైన అయ్యప్ప, శ్రీరాముడి పాటలు కూడా నాగరాజు గొంతులో వినసొంపుగా పలుకుతుండడంతో నిర్మల్ నుంచి హైదరాబాద్ వరకు పలు ప్రాంతాలలో ఇతని ఆర్కెస్ట్రా బృందం ఈవెంట్లు, వివిధ చానెల్లలో షోలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

నిషేధిత గుట్కా పట్టివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గురువారం మధ్యాహ్నం నిషేధిత గుట్కా విక్రయిస్తున్న సయ్యద్ వకీని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. అలాగే అతడి వద్ద నుంచి రూ.3,960 విలువ గల గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

నేరడిగొండ: ప్రభుత్వం నిషేధించిన గుట్కాను నిర్మల్ నుంచి నేరడిగొండకు తీసుకువచ్చి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అత్తర్ అహ్మద్ ఫారూఖి నేరడిగొండలో అమ్మడానికి తీసుకువచ్చిన గుట్కాను స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ గుట్కా విలువ రూ.6,260 ఉంటుందని తెలిపారు.

'ప్రైవేట్' పుస్తకాల గోదాం సీజ్



పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎంఈవో జయశీల

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు విక్రయిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలకు సంబంధించి గోదామును ఆదిలాబాద్ ఎంఈవో జయశీల సీజ్ చేశారు. ఏబీ వీపీ నాయకులు పట్టణంలోని మదర్స్‌కేర్ పాఠశాలకు సంబంధించి మసూద్ చౌక్‌లో ఓ గదిలో పుస్తకాలను విద్యార్థులకు విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఎంఈవోకు సమాచారం ఇవ్వడంతో గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏబీవీపీ నాయకులు మహేశ్, అక్షయ్, కార్తీక్, విజ్ఞేష్, నిఖిల్, శివతాయి తదితరులున్నారు.